
సాక్షి తిరుపతి

బుధవారం । 22 । మార్చి । 2023



ఆధ్యాత్మిక పరిమళం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈఓ ధర్మారెడ్డి, ఇతర ఆలయ అధికారులు పాల్గొన్నారు.



నేడు గరుడ సేవ

రాపూరు: పెంచలకోనలో బుధవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక వేడుకలు నిర్వహించనున్నారు. రాత్రి బంగారు గరుడ వాహనంపై స్వామివారు ఊరేగుతూ భక్తులను అనుగ్రహించనున్నారు.



అమావాస్య ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అమావాస్య ఉత్సవాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను చప్పరాలపై అధిష్టింపజేసి పురవీధుల్లో ఊరేగించారు.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్రంలోని అన్ని అన్ ఎయిడెడ్ ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం అనుసరించి 2023–24లో 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలు కల్పించాలని రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించినట్లు డీఈఓ డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. ఇందులో భాగంగా ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న (అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగులకు) 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాల (బీసీ, మైనారిటీ, ఓసీ) పిల్లలకు 6 శాతం, మొత్తం 25 శాతం సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఉచిత ప్రవేశాలకు గ్రామీణ ప్రాంతంలోని బలహీన వర్గాల వార్షికాదాయం రూ.1.2 లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.1.4 లక్షల లోపు ఉన్న వారు అర్హులని, ఆసక్తి గల తల్లిదండ్రులు ఆన్‌లైన్ ద్వారా "సీఎస్ఈ.ఏపీ.జీఓవి.ఇన్" అనే విద్యాశాఖ పోర్టల్‌లో ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 7వ తేదీలోపు నమోదు చేసుకోవాలని సూచించారు.

మాతాశిశు మరణాలపై ప్రత్యేక దృష్టి



సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి

తిరుపతి తుడా: జిల్లాలో మాతా శిశు మరణాల సంఖ్యను సున్నా శాతానికి తీసుకురావడంపై వైద్యసిబ్బంది దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీహరి సూచించారు. వైద్య అధికారులతో మంగళవారం మాతా శిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి, మార్చి నెలల్లో నాలుగు మాతృమరణాలు చోటుచేసుకున్నాయన్నారు. ఇందుకు గలకారణాలపై క్షేత్ర స్థాయిలో పర్యటించి కనుగొనాలని చెప్పారు. గర్భిణులపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమీక్షలో డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ శాంతకుమారి ఇతర వైద్య అధికారులు పాల్గొన్నారు.

విశేషశోభ!

తెలుగు ఉగాది పర్వదినం శ్రీశోభకృత్‌నామ సంవత్సరానికి సర్వం సిద్ధమైంది. ఉమ్మడి జిల్లాలోని ఆలయాలను యంత్రాంగం చూడముచ్చటగా తీర్చిదిద్దింది. అరటి పిలకలు, మామిడి తోరణాలు, వివిధ రకాల పూలు, విద్యుద్దీప కాంతులతో ప్రత్యేక అలంకరణలు చేపట్టింది. ప్రధానంగా పులుపు, వగరు, తీపి, కారం, ఉప్పు, చేదు కలగలిపి షడ్రుచులతో తయారుచేసిన ఉగాది పచ్చడిని ఉదయం నుంచి భక్తులకు పంపిణీ చేయనుంది. అలాగే ప్రముఖ అవధానులు, ఆగమసలహాదారుల ఆధ్వర్యంలో పంచాగశ్రవణాన్ని భక్తులకు విశదీకరించనుంది.



ముస్తాబైన శ్రీవారి ఆలయం

- శ్రీశోభకృత్‌నామ ఉగాది వేడుకలకు సర్వం సిద్ధం
- సర్వాంగసుందరంగా ముస్తాబైన ఆలయాలు
- పంచాంగశ్రవణం, ఆస్థానానికి ఏర్పాట్లు పూర్తి

సాక్షి, తిరుపతి: తెలుగు నూతన సంవత్సర ఉగాది వేడుకలకు ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. శ్రీ శోభకృత్ నామ సంవత్సర వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. తిరుమల శ్రీవారి ఆలయం, కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయం, తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం, అప్పలాయిగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి, శ్రీనివాస మంగాపురంలోని శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి, నారాయణవనంలో శ్రీపద్మావతి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి, నాగలాపురంలోని శ్రీ వేదనారాయణస్వామి ఆలయం, శ్రీ కోదండరామస్వామి ఆలయం, శ్రీకాళహస్తీశ్వరాలయం వంటి ముఖ్యమైన ఆలయాలతో పాటు.. ప్రతి గ్రామంలోని ఆలయాలన్నింటిలోనూ ఉగాది వేడుకలు నిర్వహించనున్నారు. అందుకోసం ఆలయాలన్నింటినీ సర్వాంగ సుందరంగా అలంకరించారు. పంచాంగశ్రవణం, ఆస్థానం నిర్వహించి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఆలయాల్లో వాహనసేవలు నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించనున్నారు.

మహతిలో ఉగాది ఉత్సవం



ఎండు కొబ్బరి చిప్పల్లో దశావతారం



దేదీప్యమానంగా శ్రీకాళహస్తీశ్వరాలయం



టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టులు, సంక్షేమ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు బుధవారం తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి కార్యక్రమాలు ప్రారంభంకానున్నాయి. ముందుగా ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో మంగళధ్వని, టీటీడీ ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థవారి వేద పారాయణం నిర్వహించనున్నారు. టీటీడీ ఆగమసలహాదారు, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యులు శ్రీవేదాంతం విష్ణుభట్టాచార్యులు పంచాంగ శ్రవణం చేయనున్నారు. తిరుపతికి చెందిన ప్రముఖ అవధాని శ్రీఆముదాల మురళి అష్టావధానం చేయనున్నారు. అనంతరం టీటీడీ ఉద్యోగుల పిల్లలకు వేషధారణ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకోనున్నాయి.



విద్యుత్ వెలుగుల్లో కాణిపాక వరసిద్ధుని ఆలయం

విద్య, పోషకాహారానికి ప్రాధాన్యం



రాగి జావను పిల్లలకు అందిస్తున్న మంత్రి ఆర్కే రోజా

- ప్రభుత్వ పాఠశాలలంటే గర్వంగా చెబుతున్నారు
- జగనన్న గోరుముద్దలో అదనంగా రాగిజావ
- అట్టహాసంగా ప్రారంభించిన మంత్రి ఆర్కే రోజా

తిరుపతి అర్బన్: 'నాడు–నేడు పథకం ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. విద్యార్థులకు బలవర్థకమైన పోషకాహారాన్ని అందించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నామని సగర్వంగా చెబుతున్నారు'. అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికవ్యవహారాలు, యువజన సర్వీసులు, క్రీడాశాఖామంత్రి ఆర్కే రోజా తెలిపారు. మంగళవారం జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మరో పోషక ఆహారం రాగి జావ అందించే కార్యక్రమాన్ని తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించగా అదే సమయంలో కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి ఆర్కే రోజా, కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, డీఈఓ శేఖర్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న విషయాన్ని వివరించారు. పేదవారు ఉన్నత చదువులు చదువుకోవడానికి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. అందులో భాగంగానే రాగిజావ పిల్లలకు అందించాలని నిర్ణయించారని చెప్పారు. గత ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకానికి రూ.450 కోట్లు వెచ్చిస్తే జగనన్న ప్రభుత్వం రూ.1824 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. బెల్లం కలిపిన రాగి జావను వారంలో మూడు రోజులు అదనంగా అందించడానికి మరో రూ.86 కోట్లు జగనన్న సర్కార్ ఖర్చు చేస్తోందన్నారు. 44,392 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని 37,63,698 మంది విద్యార్థులకు ఈ పథకం వర్తించేలా కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో జగనన్న గోరుముద్దు పథకంలో భాగంగా రాగిజావ 2,299 పాఠశాలల్లో 1,55,577 మంది పిల్లలకు వారంలో మూడు రోజులు మంగళ, గురు, శనివారాలలో అందించనున్నట్లు స్పష్టం చేశారు. డీఈఓ శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలను సక్రమంగా అందేలా కృషిచేస్తామన్నారు. అనంతరం పిల్లలకు రాగిజావను అందించారు.



తిరుపతి ఎస్వీయూ నగరపాలక పాఠశాలలో..

ఆలయాల అభివృద్ధికి మంత్రి పెద్దిరెడ్డి చేయూత



పుంగనూరు : నియోజకవర్గంలోని పురాతన ఆలయాల అభివృద్ధికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేయూతనందించారు. మంగళవారం తన సొంత నిధులు రూ.21లక్షలను ఆయా ఆలయాల అధికారులకు అందజేశారు. వివరాలు.. ఆవులపల్లెలోని సోమేశ్వరస్వామి ఆలయానికి ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసింది. చౌడేపల్లెలోని అభీష్ట మృత్యుంజయేశ్వరస్వామి గుడికి రూ.58.5లక్షలు, బెస్తపల్లెలోని మాధవరాయస్వామి ఆలయానికి రూ.40.50లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ మొత్తానికి ఆయా ఆలయాల తరఫున కాంట్రిబ్యూషన్ మ్యాచింగ్ గ్రాంట్‌ను చెల్లించాల్సి ఉంటుంది. దీనిపై స్పందించిన మంత్రి పెద్దిరెడ్డి సంబంధిత నగదును అందించడం విశేషం.

రక్షిత భవనాలు మంజూరు చేయండి

తిరుపతి మంగళం : తిరుపతి జిల్లా పరిధిలోని తీర ప్రాంతాల్లో అవసరమైన బహుళ ప్రయోజక రక్షిత భవనాలను మంజూరు చేయాలని ఎంపీ గురుమూర్తి జాతీయ తుపాను ప్రమాదం నివారణ ప్రాజెక్టు డైరెక్టర్ హర్షగుప్తాను కోరారు. ఆమేరకు ఆయన మంగళవారం ఢిల్లీలో హర్షగుప్తాను కలిసి విన్నవించారు.



ఢిల్లీలో హర్షగుప్తాను కలిసి వివరిస్తున్న ఎంపీ గురుమూర్తి

గ్రామీణ యువతకు స్పోర్ట్స్ క్లబ్‌లు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: గ్రామీణ యువత కోసం స్పోర్ట్స్ క్లబ్‌లు, స్టేడియాలు, మొక్కలు నాటేకార్యక్రమాలు, పాఠశాలలోనే సేదదీరడానికి ఫ్యామిలీ పార్క్‌లు ఏర్పాటు చేయనున్నట్టు తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం అమరావతి నుంచి వర్చువల్ విధానంలో స్థానిక కలెక్టర్ వెంకటరమణారెడ్డితో మాట్లాడారు. తుడాపరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టాల్సిన వాటిపై చర్చించారు. గతంలో నిర్మించిన ఇందిరమ్మ కాలనీల్లో వసతులు మెరుగుపరచనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలకు తమవంతు తోడ్పాటు అందిస్తామన్నారు.

ఇంటర్ పరీక్షకు 1,197 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మంగళవారం మ్యాథ్స్, బోటని, సివిక్స్ సబ్జెక్టులకు పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 141 పరీక్షా కేంద్రాల్లో జనరల్‌లో 41,014 మంది, ఒకేషనల్‌లో 3,105 మొత్తం 44,119 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1,897 మంది గైర్హాజరైనట్టు ఆర్ఐఓ వి.రమేష్ తెలిపారు.

ఉగాది పేదల జీవితాల్లో ఆనందాన్ని నింపాలి

తిరుపతి మంగళం: తెలుగు నూతన సంవత్సరాది శ్రీశోభకృత్‌నామసంవత్సర ఉగాది పేదల జీవితాల్లో ఆనందం నింపాలని నేతలు ఆకాంక్షించారు. రైతులు, నిరుపేదలు, సామాన్యులు, కార్మికులతోపాటు అన్ని వర్గాల ప్రజల్లో సుఖశాంతులు నిండాలని కోరారు. ప్రతి ఇట్లో అష్టైశ్వర్యాలు తులతూగాలని, సకాలంలో వర్షాలు పడి పంటలు బాగాపండాలని అభిలషించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు వారి జీవితాల్లో వరాలు పూయించాలని పేర్కొన్నారు. ఈ మేరకు వారు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందులో రాష్ట్ర విద్యుత్, అటవీ భూగర్భగనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డెప్యూటీ సీఎం నారాయణస్వామి, పర్యాటక శాఖా మంత్రి ఆర్కే రోజా, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, రాజంపేట ఎంపీ వెంకటరెడ్డి మిథున్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ప్రభుత్వ విప్, తుడా చైర్మన్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు భూమన కరుణాకరరెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆదిమూలం, వరప్రసాద్, కిలివేటి సంజీవయ్య, వెంకటేగౌడ, ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబు తదితరులు ఉన్నారు.

అధికారుల శుభాకాంక్షలు

తిరుమల: తెలుగు నూతన సంవత్సరాది శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి , ఈఓ ఏవీ ధర్మారెడ్డి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, జెసీ డీకే బాలాజీ, డీఆర్వో శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు.

ఫిర్యాదుదారులకు అండగా నిలవాలి


ఏర్పేడు పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి


క్రైమ్ మీటింగ్‌లో కేసుల వివరాలు వెల్లడిస్తున్న పోలీస్ సిబ్బంది


రేణిగుంట: నేరనియంత్రణ సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ, పక్కన అడిషనల్ ఎస్పీలు

ఏర్పేడు: ఫిర్యాదు దారులకు పోలీస్ స్టేషన్ అండగా నిలవాలని తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఏర్పేడు పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో జనరల్, కేసుల డైరీ, కోర్టు క్యాలెండర్ తదితర రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. పోలీస్ క్వార్టర్స్, ఆవరణను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదు దారులతో ఆత్మీయంగా, హుందాగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించకుండా అరికట్టడానికి ప్రత్యేక భద్రతా దళాలతో పెట్రోలింగ్ చేయాలన్నారు. ఏర్పేడు మండలంలోని ఐఐటీ తిరుపతి, ఐసర్ (ఐఐఎస్ఈఆర్), తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం చుట్టుపక్కల ఉన్న ఇండస్ట్రియల్ ఏరియా, హైవే వరకు బీట్ సిస్టమ్‌ను బలోపేతం చేయాలన్నారు. సమీక్షలో రేణిగుంట డీఎస్పీ రామచంద్రయ్య, సీఐలు శ్రీహరి, చంద్రశేఖర్‌పిళ్లై, ఎస్ఐ రఫీ పాల్గొన్నారు.

నేర నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ

రేణిగుంట: ప్రతి పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది, అధికారులు బాధ్యతగా వ్యవహరించి నేర నియంత్రణకు కృషి చేయాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. రేణిగుంట ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన రేణిగుంట, శ్రీకాళహస్తి, పుత్తూరు సబ్ డివిజన్ల పరిధిలోని పోలీసు అధికారులతో క్రైం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నందువల్ల ప్రమాదకర మలుపులు, రోడ్డు క్రాసింగ్‌లు, విద్యాసంస్థలు, రోడ్ డైవర్షన్ ఉన్న ప్రతిచోటా అవసరమైన మేర సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. అసభ్యకరంగా, అవమానకరంగా ప్రవర్తించినట్లు తన దృష్టికొస్తే సహించేదిలేదన్నారు. ఏ రకమైన ఒత్తిడులకు లొంగకుండా బాధితులకు న్యాయం చేయడంలో పోలీసులు బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీలు వెంకటరావు, విమలకుమారి, కులశేఖర్, ఎస్బీ డీఎస్పీ సురేందర్ రెడ్డి, సబ్‌డివిజన్ డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రంలో ఏనుగుల విధ్వంసం


ఏనుగుల దాడిలో ధ్వంసమైన మామిడి చెట్లు

రేణిగుంట: రేణిగుంట మండలం రాస్ కృషి విజ్ఞాన కేంద్ర వ్యవసాయ క్షేత్రంలోకి సోమవారం రాత్రి ఏనుగుల గుంపు విధ్వంసం సృష్టించింది. వివిధ వ్యవసాయ, ఉద్యాన పంటలను తొక్కి సర్వనాశనం చేసింది. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త సీనియర్ డా.శ్రీనివాసులు పరిశీలించారు. 250 మామిడి మొక్కలు, ఎకరా వేరుశనగ విత్తనోత్పత్తి క్షేత్రం, ఎకరా సంపంగి, 1.5 ఎకరాల మిరప, 0.5 ఎకరాల్లో బంతి, టెంకాయ చెట్లను ధ్వంసం చేసినట్టు తెలిపారు. డ్రిప్ పైపులు, గేట్ వాల్వ్స్, మోటార్లు, స్టార్టర్లను ధ్వంసం చేశాయన్నారు. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు తెలిపారు.





రాయితీ పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: రాయితీలతో ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలకు షెడ్యూల్డ్ కులాల వారు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మంగళవారం సూచించారు. ప్రధానంగా అమృత్ జలధార స్కీమ్(ఏజేఎస్) ద్వారా బోరు బావి, బోరు మోటార్, డ్రిప్, స్ప్రింక్లర్ తదితర యూనిట్లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నా. అలాగే స్వయం ఉపాధి కోసం ముర్రా జాతి గేదెలు (రెండు), గొర్రెల పెంపకం, మినీ డెయిరీ(పాడి గేదెల పెంపకం), ట్రాక్టర్, ట్రైలర్, ప్యాసింజర్ వాహనం (కారు), ప్యాసింజర్ వాహనం (వ్యాను), ఆటో మొబైల్ సర్వీసింగ్ యూనిట్, బ్యాటరీ సర్వీసింగ్ యూనిట్, కొవ్వొత్తుల తయారీ, ఎంబ్రాయిడరీ అండ్ టైలరింగ్, ఎలక్ట్రానిక్ గూడ్స్ రిపేర్ సెంటర్, కంప్యూటర్ సేల్స్ అండ్ సర్వీసింగ్, సెల్‌ఫోన్ సర్వీసింగ్, కాంక్రీట్ మిల్లర్, మట్టి ఇటుకల తయారీ, పచ్చళ్లు, ఫొటో అండ్ వీడియో షాపు, స్టీల్ అండ్ సిమెంట్ షాపు, తెల్ల ఫినాయిల్ తయారీ, ఐస్ క్రీమ్, చెప్పుల షాపు, శానిటరీ మార్టు, రెడీమేడ్స్ గార్మెంట్స్, సేమియా, డీటీపీ జిరాక్స్, సివిల్ ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ, మినీ సూపర్ బజార్, 2వీలర్ అండ్ 4 వీలర్ మెకానిక్ తదితర యూనిట్లకు యూనిట్ విలువలో 50 శాతం రాయితీ లేదా 60 వేలు సబ్సిడీ ఇవ్వనున్నట్టు తెలిపారు. దరఖాస్తుదారులు తెల్లరేషన్‌కార్డు, ఆధార్, కులధ్రువీకరణ పత్రం, ఆదాయపు పత్రం, మొబైల్ నంబర్, బ్యాంక్ పుస్తకం, భూమి పట్టదారు పుస్తకం, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జతచేయాలన్నారు. అర్హులైన వారు బ్యాంక్ పోర్టల్ ఎస్‌బీఎంఎస్.ఆన్‌లైన్‌లో ఎన్‌సీవోజీ.జీవోవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.



శెట్టిపల్లి విలీనంపై హర్షం

- తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లోకి కలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు

తిరుపతి తుడా: శెట్టిపల్లి వాసుల కలను నెరవేర్చుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విలీన నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లోకి శెట్టిపల్లి పంచాయతీని విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ ఉత్తర్వులు జారీచేశారు. గడిచిన కొన్నేళ్లుగా శెట్టిపల్లి పంచాయతీని తిరుపతి నగర పాలక సంస్థలోకి విలీనం చేయాలన్న ప్రయత్నం విఫలమైంది. 2020లో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి శెట్టిపల్లి పంచాయతీని తిరుపతిలోకి విలీనం చేయించేందుకు కృషి చేశారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి విలీనాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పంచాయతీలో తీర్మానం చేయించారు. ఆ వెంటనే ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. ఆపై ఎమ్మెల్యే భూమన ప్రభుత్వంతో పలుదపాలు చర్చలు జరిపారు. విలీనమైన శెట్టిపల్లి పంచాయతీలో శెట్టిపల్లి, శెట్టిపల్లి హరిజనవాడ, సీఆర్ఎస్ క్వార్టర్స్ కాలనీ, వినాయకనగర్, ఉప్పలపాళ్యం గ్రామాల పరిధిలో మొత్తం 1,273 గృహాలు ఉన్నాయి.

క్రేన్ ఢీకొని వృద్ధుడి మృతి

తడ: జాతీయ రహదారిపై మంగళవారం క్రేన్ ఢీకొన్న ప్రమాదంలో కారూరు పంచాయతీ, ఖాళింగాడుకుప్పానికి చెందిన పూండి రాజి(68) మృతి చెందాడు. ఎస్ఐ జేపీ శ్రీనివాసరెడ్డి కథనం.. జాతీయ రహదారి దాటే ప్రయత్నంలో ఆరంబాకం వైపు నుంచి తడకు వస్తున్న క్రేన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజి తలకు బలమైన గాయం కావడంతోపాటు క్రేన్ చక్రాలు ఆయన పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

గంజాయి తరలిస్తున్న ఆరుగురు యువకుల అరెస్టు

నాయుడుపేట టౌన్: పట్టణ శివారు ప్రాంతంలో గంజాయి తరలిస్తున్న ఆరుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు ఆ వివరాలను వెల్లడించారు. మాలయ కోట వద్ద గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ శ్రీకాంత్ తమ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి ఆరుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.లక్షకు పైగా ఉంటుంది. పట్టుబడిన వారిలో నాయుడుపేటకు చెందిన మణిబాబు (మాలయ కోట), షేక్ సిరాజ్ (ఎల్ఏ సాగరం), షేక్ మస్తాన్, షేక్ షమీల్ (రాజగోపాలపురం), చాల్ల రవీంద్ర (గొట్టిప్రోలు), పిల్లెల రాజేష్ (అగ్రహారపేట)కు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



